నిజం చెప్పేస్తానేమో అని భయం..."

"నిజం సెప్పడానికి భయమా?" ఆశ్చర్యపోయాడు అప్పన్న.

"అది నా దురదృష్టం తమ్ముడూ. అమాయకులయిన అమ్మనీ అయ్యనీ మోసగించ వలసి వస్తాంది"

"అమ్మనీ అయ్యనీ మోసగించడమా?" ఆగి "చదువు కున్నోడివి..."

"చదువుకున్న వాడిని కనుకనే. నోటి ముందరి కూటిని లాక్కున్నా ఫర్లేదు కాని కంటి ముందు కలలను పగలగొట్టడం నేరం".

"అంటే... బతకలేకా...?" ఆశ్చర్యంగా చూశాడప్పన్న.

"ఔను. అంతే"

"బతకడానికెన్ని దారులు లేవు? రిక్షాలాగొచ్చు... మూటలు మొయ్యొచ్చు. ఏ హోటల్లోనో కప్పులు కడగొచ్చు... అటువంటి పనులు చేస్తే పరువుతక్కువనా?"

"అదేమీ కాదు. పనిచెయ్యక పోతేనే పరువు తక్కువ కాని, చేస్తే కాదు. నా వరకూ అయితే నేనేపని చెయ్యడానికయినా సిద్ధమే. కాని, దొంగల తల్లి కేడవ భయమని నేను అమ్మగురించీ అయ్య గురించీ పల్లె గురించీ ఆలోచిస్తూ వెనుకంజ వేయవలసి వస్తాంది. కలక్టరు కాలేకపోతే కనీసం క్లర్కయినా కాకుండా రిక్షాలాగానంటే మా అయ్య గుండె పగిలిపోతుంది. తల్లికీ, చెల్లికీ, పల్లెకీ అందరికీ చదువంటే విశ్వాసం పోతుంది. నావల్ల విద్యకే విలువ నశించి పోతుంది." నిట్టూర్చి... "నేను చదువులోకి దిగకపోతే మాకు పొలం ఉండి ఉండేది. ఉద్యోగం కోసం పెట్టిన ఖర్చుతో మంచి కిళ్ళీకొట్టయినా పెట్టుకుని హాయిగా బతకగలిగేవాళ్ళం. ఈ చదువు నా బతుక్కీ భవిష్యత్తుకీ సంకెళ్ళు వేసి బందీని చేసి వదిలింది." విచారంగా తల పట్టుకుని "నన్నూ మా కుటుంబాన్నీ నాశనం చేసింది. నేనే చదువుకోకుండా ఉంటే..." అన్నాడు.

అప్పన్న తెల్లబోతూ చూశాడు. వాడి ఆశ్చర్యానికంతులేదు.

(1979లో ఆంధ్రభూమి వీక్లీ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందినది)

# మెరుపు

రాత్రి - పది గంటలు దాటుతున్న వేళ. రోడ్డుమీద అట్టే మంది జనం లేరు. కాని ఉన్న కొద్దిమందీ అతన్ని ఓ సారి చూసిన వారు మరోమారు చూడకుండా ఉండలేక పోతున్నారు. ఆశ్చర్యపడకుండానూ ఉండలేక పోతున్నారు. ఎందుకంటే అతను ఖరీదైన సూటూ, బూటూ వేసుకుని, చక్కని కళ్ళజోడు పెట్టుకుని అడ్వర్టయిజ్‌మెంట్ మోడల్‌లా, సినిమాల్లో హీరోలా అందంగా, దర్జాగా ఉండటమే కాక ధీమాగా, ఠీవిగా నడుస్తున్నాడు. చూడగానే ఏ జమీందారో అనిపించేటట్టున్నాడా అందమైన

యువకుడు. అతని ప్లైపిన్ దీపాల కాంతిలో మెరుస్తూంది.

"బాబూ!" దీనంగా అర్థించిందొక యాచకురాలు. "నాల్రోజులై తిండి లేదు."

"అయ్యో! తిండి లేకపోతే ఎంత కష్టం!" అంటూ జేబులోంచి చేతికందిన నోటు తీసి ఆమె చేతిలో ఉంచాడు. అది ఐదు రూపాయల నోటు.

మొదట ఆమె నమ్మలేకపోయినా "పది కాలాలు పచ్చగా వర్థిల్లు మహారాజా!" అని దీవించింది. కాని అప్పటికే అతనామెను దాటి దూరం వెళ్ళిపోయాడు.

ఖరీదైన బార్‌కమ్‌రెస్టారెంట్ ముందు ఆగిన అతన్ని – వంగి సలామ్ చేస్తూ ఆహ్వానించాడు ద్వారం దగ్గర గూర్ఖా, తలుపు తీసి అతను లోపలికి వెళ్ళి ఓ టేబులు ముందు కుర్చీలో కూర్చోడమేమిటి, బేరర్ పరుగెత్తు కొచ్చాడు.

"రాయల్ శాల్యూట్.."

అదిరి పోయాడు బేరర్ "సారీ సార్!... ఇక్కడ అంత ఖరీదైన డ్రింక్ ఎవరూ తీసుకోక - ఉంచలేదు. బ్లాక్ డాగే ఇక్కడ దొరికే బెస్ట్ విస్కీ సార్... ఈ ఊళ్ళోనే దొరకదు సార్ రాయల్ శాల్యూట్.."

"బ్లాక్ డాగా?" నీరసంగా, విచారిస్తున్నట్లు నిట్టూర్చి "సరే అదే ఓ లార్జ్ తీసుకురా. అన్‌రాక్స్, డిన్నర్‌లోకి స్పెషల్సయినా మంచివి ఉన్నాయా?" అడిగాడు.

"మీలాటి వారి కేమివ్వాలో నాకు తెలుసుసార్! మీకు అత్యుత్తమమైన భోజనం తెస్తాను" అంటూ వినయంగా వచ్చి వెళ్ళాడు బేరర్ లోపలికి.

అర గంట అనంతరం అతను పాన్ నములుతూ. రీజెంట్ సిగరెట్ కాలుస్తూ, హోటల్ కారిడార్‌లో నడుస్తూంటే చీకటి వెలుగున ఓ చిన్నది. అందమైన అమ్మాయి. ప్రేమగా సంకేతం పంపింది.

అతను ఆగి, ఆమె వైపు అడుగువేసి, ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని.....

ఒక నిమిషం తరువాత ఆమె నమ్మలేక పోయింది. ఒక్క ముద్దుకి వందరూపాయలా? అందరూ ఈయనలా అయితే తనెంత సంపాదించేదో ఈ పాటికి!

అప్పటికే అతను ద్వారం వరకూ వెళ్ళిపోయాడు. గూర్ఖా తలుపు తీస్తూ మీరు కారు తెచ్చినట్లు లేదు. టాక్సీ పిలిచేదా? అన్నాడు సలామ్ చేస్తూ.

ఓ ఐదు రూపాయల నోటు యిచ్చేసి "వద్దులే, నేనే పిలుచుకుంటాను". అన్నాడు.

"సర్! నా కవకాశం ఇవ్వండి. మీ హోదాకి తగినది తెస్తాను.

రెండు నిముషాల్లో అతని దగ్గర ఆగింది టాక్సీ. డ్రయివరు అతనికి డోరు తెరచి పట్టుకున్నాడు.

"రండి సర్."అతను హుందాగా కారు ఎక్కి కూర్చుని "సీటు మెత్తగా లేదే!" అన్నాడు చికాకుగా

"క్షమించండి సార్, ఆ... ఎక్కడికి పోనిమ్మంటారు సార్?" అంటూ స్టార్ట్ చేసాడు.

"వెన్నెల చాలా బాగుంది కదూ!"

"యస్సర్."

"వెన్నెల్లో నది ఇంకా బాగుంటుంది. వంతెన మీదనుంచి చూస్తే పైన చందమామ. కింద గీతలా నది మరీ అద్భుతంగా ఉంటుంది."

"మీరు రైటరా సార్? ఆహా... మీ సౌందర్య కళాపోషణ నిజంగా అద్భుతం సార్... ఇన్నేళ్లలో ఏ ఒక్కరూ నా టాక్సీలో రాత్రివేళ... పున్నమి నదిని చూడాలని రాలేదంటే నమ్మండి. ఎంత డబ్బున్నా సౌందర్యారాధన తగ్గిపోతూంది సార్. ఎంతసేపూ సినిమాలు, టీ.వీ. అంతే సౌందర్యం మరచిపోయారు."

అతను నవ్వేశాడు. టాక్సీ స్లో అయింది.

"కొంచెం ముందుకి, బ్రిడ్జి మధ్యకి, అక్కడ అనుకూలంగా బాగుంటుంది. పైన జాబిలి, కింద నది, మధ్య బ్రిడ్జి మీద నేను. ఎంతో ప్రశాంతంగా, వెన్నెలలో... ఎక్సలెంట్! ఐ లవ్ దట్. ఆపెయ్. ఇదే మంచి పాయింట్."

అతను దిగి కోటు జేబులో చెయ్యిపెట్టి తీసి అందించాడు టాక్సీ డ్రైవర్‌కి.

"ముప్పయ్ రెండు" ఆశ్చర్యంగా చూశాడు డ్రయివర్.

"సారీ. నా దగ్గరున్నది అంతే."

"వెయిట్ చేసేదా సర్? మీటర్ పన్నెండే."

"మిగిలింది నువ్వుంచుకో. వెయిట్ చెయ్. కానీ వీలైతే ఓ గంట పోయాక రా"

"తప్పకుండా వస్తాను సర్. ఈ రాత్రిమీద జనమూ ఉండరు. వెహికల్సూ ఉండవు మీ లాంటి వారు ఊళ్ళోకి నడిచి రావడమా సార్. సరిగ్గా గంటలో రమ్మంటారా? ముందు రానా?"

"ముందుగా వద్దు, గంటపోయాక. థాంక్యూ, గుడ్ నైట్."

★ ★ ★ ★ ★

గంట పోయాక వచ్చిన టాక్సీ డ్రైవర్‌కి ఎంత వెతికినా అతను కనిపించలేదు. కాని అతను దిగిన చోట బట్టల మడతలు – కోటు నీటుగా మడతపెట్టి వాటి కింద ఓ పక్కన బూటు. ఒక ఉత్తరం.

ఆ ఉత్తరం తీసి చదివాడు డ్రయివరు.

నేను నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాను. ఘనంగా జీవించాలని పాతికేళ్ళకు పైగా పరిస్థితులతో పోరాడి జయించలేక విసిగి... కనీసం ఘనంగా చావనైనా చావాలని నిశ్చయించుకున్నాను. ఆరు నెలలు చాలా పొదుపుగా డబ్బు కూడ బెట్టుకుని చనిపోయే రాత్రిని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నాను. ఈ సూటూ, బూటూ నాగరాజు డ్రామా డ్రెస్‌కంపెనీ కందచేయాలి. ఈ రాత్రి కొన్ని గంటల... ఆహా... నిముషాల పాటు నేను గొప్పగా బ్రతికేను, నా మట్టుకు మనిషి ఘనంగా బతక లేకపోతే కనీసం చావడమైనా ఘనంగా చావాలి. అదయినా సాధించ గలిగినందుకు నా కెంత సంతోషంగా ఉందనీ! థాంక్యూ అండ్ గుడ్ బై! అనామకుడు."

(1988 ఆంధ్రప్రభ వీక్లీ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందినది)

✡ ✡ ✡ ✡ ✡